త్మని మేల్కొలిపి, నాలోని అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి, జ్ఞానతేజాన్ని ప్రతిష్ఠించిన దేవతాస్వరూపిణివి నువ్వు, మాతా, అనుగ్రహించి సుధాకర కిరణ సదృశాలైన నీచల్లటి చూపుల్ని ఒకసారి ఈదీనుడిపై ప్రసరింప జెయ్యితల్లీ"

(నుదుటిపై మచ్చనుచూపును.)

"నాయనా, పశ్చాత్తప్త హృదయుడవైన నీపాపాలు పరిహరించబడ్డాయి. నువ్వెంతో ధన్యుడివి. సదా మద్యపానాది దుర్వ్యసనాలచేత మైమరచి, యుక్తాయుక్తాలు తెలియక సాధ్వీమణులైన రమణుల్ని వంచింపదలచే కాముకులో కాని కాదర్శప్రాయుండ వగుదువుగాక!

చను!, మాతృ ఋణవిమోచనాయత్తచిత్తుడవై."

"ధన్యుణ్ణి తల్లీ—ధన్యుణ్ణి,"

(వెడలిపోవును.)

వి. వి. యస్. సత్యనారాయణరావు.

---

## నారిస్టువాచీ.

రిస్టువాచీలు ఈరోజుల్లో చాలామంది ధరిస్తున్నారు. ఒక్కమగవాళ్ళే కాకుండా, ఆడవారుకూడా పెట్టుకొంటున్నారు వీటిని. మొత్తంమీద రిస్టువాచీలు ధరించడం ఒకఫేషను అయిపోయింది ఇప్పుడు. చేతికి రిస్టువాచీ పెట్టుకోడం మాటిమాటికి ఒక్కసారి చెయ్యిపైకెత్తి టైము చూచుకోడం మహాపని, నిముషనిముషానికి వున్న గ్రేటు పీపులు లాగ. అంత పనివున్న గ్రేటుపీపులు కూడా వీరు టైము చూచుకొనే అన్నిమార్లు చూచుకోరనే తలుస్తాను. ముఖ్యంగా వీరి వుద్దేశ్యం తమరు కూడా రిస్టువాచీ ధరించామని చుట్టుప్రక్కలవున్న అందరికి తెలియాలని కాబోలని అనుకుంటాను నేను.

ఏదిఎలావున్నప్పటికి, ఈవాచీలు ధరించేవారిలో కొన్ని కేటగిరీలున్నాయి. నిజంగా కొనుక్కొని వాచీలు ధరించేవారిది ఒకరకం. మామగారివద్దనుండి ప్రజెంటు కొట్టి వాట్లని మేక్ యూసాప్ చేసేవారి దొకరకం. భార్యలకున్నవాటిని తమసొత్తేయన్నట్లు ధరించేవారి దొకరకం. చుట్టాలుగాని, స్నేహితులుగాని, ఈవాచీని నీవరుగున్న మంచి రిపేరుపద్ద బాగుచేయించమని ఇచ్చినదాన్ని, బాగుచేయించి తమ సొంతంలాగ చేతులకు ధరించి, తాముకూడా పెద్దఫేషనబుల్ జంట్రీలాగ త్రిప్పుకొని తిరిగే మహానుభావుల రకం ఒకటి.

ఇలాంటి రకాలు ఇంకాచాలా వున్నయి. కాని నాకూ ఈరకాలకు ఏమీసంబంధం లేదు. నారకానికీ ఈరకాలకి చాలా తేడా వుంది. నారకం అదో తమాషారకం. అంటే నేను ఒకళ్ళ రిస్టువాచీ చెక్కేసి ధరించేరకం కాను సుమాండీ. ఈతమాషారకం ఏమిటో పాఠకులే వూహిస్తారు నాకు రిస్టువాచీ ఏవిధంగా వచ్చిందో చెపుతే.

అసలు నాకు రిస్టువాచీ లేదు. మాక్లాసులో వున్న విద్యార్థుల కందరికీ ఇవి వున్నాయి. నాకెప్పుడైనా క్లాసులో విసుగ్గావుండి, ఈపిరీడ్‌కు టైము ఇంకా ఎంతవుంది? అని నాప్రక్కను వున్న స్నేహితుని ఎవనినైనా అడిగితే, అబ్బా ఏమిటోయ్! అస్తమానూ టైముఎంతుంది! ఎంతైంది? అని చంపుతావు. నీవుకూడా ఒకరిస్ట

247

వాచీ కొనుక్కొని నీకు కావలసినప్పుడు టైము చూచుకొంటూ వుండకూడదూ ? అని బదులు చెప్పేవాడు.

ఈసంగతిఅంతా చూస్తే నాకుకూడా ఒకరిష్టువాచీ వుంటే బాగుంటుం దనిపించింది. కాని కొనడానికి ఎందువల్లనోకాని ఇష్టం వుండేదికాదు.

ఇలావుంటూండగా సంక్రాంతి పండుగ దగ్గరకి వస్తోంది. తమయింటికి పండుగకు రమ్మనమని మామామగారు వుత్తరం వ్రాశారు. అది చూచి నాస్నేహితుడొకడు, రిస్టువాచీ కొనియిస్తే వస్తాను, లేకపోతే లేదని, జవాబు వ్రాయమన్నాడు. వెంటనే అలాగ వుత్తరం వ్రాశాను మామామగారికి. ముందుగా వాచీపంపితేవస్తాను అని ఏవిధం అయిన మొగమాటంలేకుండా వ్రాశాను.

పదిహేనురోజులు గడచాయి నాకువాచీ ఇంకా రాలేదు. పండుగచూస్తే నాలుగురోజులే వుంది. ఇంకా వారునాకు వాచీపంపరని అనుకొన్నా. పండుగకు అత్తవారింటికి వారు పిలచినప్పుడు వెళ్ళకపోతే బాగుండదని ఆలోచించి ఎలాగైనా వెడదామనుకొని నిర్ధారణ చేసికొన్నా.

మర్నాడు వుదయం ఎనిమిదిగంటలకు పోస్టుమేన్ నారూమువద్ద నాపేరెట్టి పిలచి, నాకొక రిజస్టర్డు పార్సిలు వచ్చిందన్నాడు. సంతకం చేసి పార్సిలు తీసికొన్నా.

పార్సిలువిప్పే సరికి నాకుమిక్కిలి ఆనందం కలిగింది. ఎందుచేత నంటే అందులో వున్నది ఒకరోల్డు గోల్డు రిస్టువాచీ.

తక్షణం టెలిగ్రాఫాఫీసుకు సైకిలుమీద పోయి, ఆరోజు సాయంత్రం మొయిలులో బయలుదేరి మర్నాడు వుదయానికి వారి గ్రామం వస్తున్నానని మామామగారికి టెలిగ్రాం ఇచ్చాను

అలాగ టెలిగ్రాం ఇచ్చినట్లుగా, సాయంత్రం బయలుదేరి మర్నాడు వుదయానికి మాఅత్తవారింటికి చేరుకొన్నా.

మధ్యాహ్నం భోజనాలయాక మేమంతా కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ వున్నసమయంలో మామామగారు నాకేసిచూసి, "నీపెండ్లాముచేసిన పనిచూశావా ?" అని అన్నారు.

అదేమిటో అనుకొని నేను కొంచెం భయపడి, కంగారుగా ఆయనకేసిచూడ్డంమొదలెట్టాను.

"నీవు రిస్టువాచీ పంపితేనేగాని రానని వ్రాసిన వుత్తరం చూచి, నీవెలాగైనా ఈపండుగకు రావలసినందుకుగాను, ఒకరిస్టువాచీకి ఆర్డరుచేసి, తనవద్దనున్న సొమ్ము చెల్లించి, మొన్ననీకు ఆ వాచీని పంపించింది. 'ఇలాచేస్తున్నానని' నాకుగాని వాళ్లమ్మకుగాని చెప్పలేదు. సంగతింతా నిన్ననీవిచ్చిన టెలిగ్రాము వచ్చినతర్వాత వాళ్లమ్మతో చెప్పిందట. చూచావా దాని స్వతంత్ర బుద్ధి! ఇంతకీ దాన్ని అనవలసిన పనేముందిలే. ఆడవాళ్లకు స్వతంత్ర బుద్ధినిచ్చే విద్యను అనాలిగాని. అని ఒక పెద్దలెక్చరు కొట్టారు.

వెంటనే నాకుఆశ్చర్యము, ఆనందం కలిగాయి మాఆవిడ యందు అదో విధమైన ప్రేమ కూడా జనించింది. "ఆలాగా! నాకు రిష్టువాచీ కొని పంపించింది మా ఆవిడేనా!" అని అనుకొని పక చిరునవ్వునవ్వాను.

మాఆవిడ కొని నాకు పంపించిన రిష్టువాచీయే నేను పెట్టుకుంటూవున్నది

ఈవిధంగా వచ్చింది నారిష్టువాచీ. ఈరీతిగా నారకం, పైనచెప్పినరకాల్లోకల్లా పక కొత్తరకంగా యేర్పడింది.

—వి. వి. యస్. ఆర్. హనుమంతరావు.